క్లుప్తంగా

అంగన్‌వాడీ వార్షికోత్సవం



చిన్నారులతో అంగన్‌వాడీ టీచర్లు

వేములవాడఅర్బన్: పట్టణంలోని గాంధీనగర్, ముదిరాజ్‌వీధి అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం అంగన్‌వాడీ వార్షిక వేడుకను ఘనంగా నిర్వహించారు. చిన్నారులతో నృత్యాలు చేయించి బహుమతులను అందించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కనకమ్మ, టీచర్లు శ్రీవాణి, నాగజ్యోతి తదితరులున్నారు.

ఈత చెట్ల నరికివేత



రాచర్లగొల్లపల్లిలో నరికేసిన ఈత చెట్లు

ఎల్లారెడ్డిపేట: రాచర్లగొల్లపల్లిలో గుర్తుతెలియని వ్యక్తులు ఈత చెట్లను శుక్రవారం నరికేశారు. గీత కార్మికులకు ఉపాధినిచ్చే చెట్ల నరికివేత కలకలం రేపింది. గ్రామ శివారులో ఈత చెట్లను కొందరు రైతులు పెంచుతున్నారు. వాటిని గీత కార్మికులు తీసుకొని రైతులకు కొంత డబ్బులివ్వడం గ్రామాల్లో ఆనావాయితీగా వస్తోంది. రైతులు కంటికి రెప్పలా కాపాడుకుంటున్న ఉపాధినిచ్చే చెట్ల నరికివేతపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈత చెట్ల నరికివేతపై గతంలో అధికారులు అనేక కేసులు నమోదు చేశారు. ఎక్సైజ్ అధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ఎల్లారెడ్డిపేట: అల్మాస్‌పూర్ గ్రామ శివారులో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. ఇందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. కోనరావుపేట మండలం వట్టిమల్లకు చెందిన భూక్య రమేశ్, నరేశ్ ఎల్లారెడ్డిపేటకు ద్విచక్ర వాహనంపై వస్తుండగా.. ఎదురుగా మనాలకు చెందిన నాజ్యం అనే యువకుడు మరో ద్విచక్ర వాహనంపై వస్తూ ఎదురెదురుగా ఢీకొట్టుకున్నారు. ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. నరేశ్ పరిస్థితి విషమంగా ఉంది. క్షతగాత్రులను ప్రైవేట్ వాహనంలో సిరిసిల్ల ఏరియాసుపత్రికి తరలించారు.

పరామర్శ



బోయినపల్లిలో పరామర్శిస్తున్న బండి

బోయినపల్లి: మండల కేంద్రానికి చెందిన బీజేపీ నియోజకవర్గ జాయింట్ కన్వీనర్ ఉదారి నర్సింహాచారి తండ్రి ఉదారి శంకరయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ శుక్రవారం సాయంత్రం నర్సింహాచారి కుటుంబాన్ని పరామర్శించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అల్లాడి రమేశ్, బీజేపీ మండల అధ్యక్షుడు గుడి రవీందర్‌రెడ్డి, నాయకులు ఎడపల్లి పరశురామ్, కొనుకటి హరీశ్, సెల్‌పాయింట్ అనిల్ తదితరులున్నారు.

అంబేడ్కర్ సంఘం నాయకుల సమావేశం



ఇల్లంతకుంటలో కరపత్రం విడుదల చేస్తున్న నాయకులు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఇల్లంతకుంట మండల కేంద్రంలో శుక్రవారం అంబేడ్కర్ సంఘాల మండల అధ్యక్షుడు తడ్కపెల్లి భూమయ్య ఆధ్వర్యంలో సంఘాల నాయకులతో మండలస్థాయి సమావేశం నిర్వహించారు. భూమయ్య మాట్లాడుతూ.. ఆదివారం రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించాలని సూచించారు. వల్లంపట్లలో సాయంత్రం జరిగే ఉత్సవాలకు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఉత్సవాల కరపత్రాన్ని విడుదల చేశారు. రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ సావనపెల్లి రాకేశ్, సీనియర్ నాయకులు గన్నేరం నర్సయ్య, పసుల వెంకట్, మచ్చ రాజేశం, సావనపెల్లి శంకర్, మల్లమారి బాబు, దమ్మని మధు, బట్టు బాబు, మచ్చ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇష్టారాజ్యంగా రోడ్డు పనులు



డివైడర్ల మధ్యలో పోసిన మొరం



నీలోజిపల్లి రోడ్డులో ఒకవైపు నిర్మించిన డివైడర్

- కొదురుపాకలో డివైడర్ల మధ్య మొరం
- మొక్కల పెంపకానికి విఘాతం
- కొన్నిచోట్ల డివైడర్లు నిర్మించని వైనం
- రోడ్డు ఎత్తున్న ప్రాంతంలో లేని రాతి కట్టు, రేలింగ్

బోయినపల్లి: కరీంనగర్–సిరిసిల్ల ప్రధాన రహదారిలో మండలంలోని కొదురుపాక నుంచి నర్సింగాపూర్ స్టేజీ వరకు రెండు బిట్లుగా నిర్వహిస్తున్న ఫోర్‌లేన్ రోడ్డు పనులు ఇష్టారాజ్యంగా చేపడుతున్నారనే ఆరోపణలు వినవస్తున్నాయి. కొదురుపాక ఎక్స్ రోడ్డు నుంచి వెంకట్రావుపల్లి లెఫ్ట్ కెనాల్ వరకు ఒక బిట్, లెఫ్ట్ కెనాల్ నుంచి నర్సింగాపూర్ స్టేజీ వరకు మరో బిట్ పనులు నిర్వహిస్తున్నారు. రెండు బిట్ల ఫోర్‌లేన్ రోడ్డు పనులకు రూ.20.45కోట్ల నిధులు మంజూరయ్యాయి. రోడ్డు పనులు పూర్తవుతున్న క్రమంలో కొన్నిచోట్ల డివైడర్లు నిర్మంచకపోవడం, మరికొన్నిచోట్ల ఒకవైపు నిర్మించడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

డివైడర్ల మధ్యలో మొరం

ఫోర్‌లేన్ రోడ్డుకిరువైపులా వాహనాల రాకపోకలకు వీలుగా మధ్యలో డివైడర్లు నిర్మించారు. అధికారుల పర్యవేక్షణ లోపంతో డివైడర్ల మధ్యలో ఎర్ర మట్టికి బదులు కంట్రాక్టర్ మొరం పోయడం విమర్శలకు దారి తీస్తోంది. మొరం పోసిన చోట్ల మొక్కలు ఎలా పెడతారని పలువురు ప్రశ్నిస్తున్నారు. డివైడర్ల మధ్యలో మొరం పోసిన ప్రాంతాల నుంచి అధికారులు మొరం తీయించి ఎర్ర మట్టి పోయించాలని పలువురు కోరుతున్నారు. వెంకట్రావుపల్లి లెఫ్ట్ కెనాల్ నుంచి నర్సింగాపూర్ స్టేజీ వరకు రోడ్డుకు రెండువైపులా డివైడర్లు నిర్మించలేదు. నీలోజిపల్లి గ్రామ పరిసరాల్లో ఒకవైపు డివైడర్ నిర్మించి మరో వైపు మరిచారు.

వానాకాలం ఇబ్బందే..

కొదురుపాక నుంచి నీలోజిపల్లి పరిసరాల వరకు రోడ్డుకిరువైపులా భారీగా మొరం పోశారు. దీంతో రోడ్డు చాలా ఎత్తుగా ఉంది. ఇళ్లు కిందికయ్యాయి. వర్షాకాలంలో వాన కురిస్తే మొరం మొత్తం కొట్టుకుపోయి కయ్యలు పడి రోడ్డు చెడిపోయే ప్రమాదముందని పలువురు పేర్కొంటున్నారు. రోడ్డు ఎత్తయిన ప్రాంతంలో రాతి కట్టడాలు(బండ రాళ్లతో నిర్మాణం) చేపట్టి రేలింగ్ నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. వర్షాకాలానికి ముందే ఈ పనులు చేపట్టాలని, లేదంటే రోడ్డు పక్కల్లో ఉన్న మొరం మొత్తం కయ్యలు పడి రోడ్డు దెబ్బతింటుందని ఈ ప్రాంతవాసులంటున్నారు.

ఎర్ర మట్టి పోయాలి



కొదురుపాక చౌరస్తా నుంచి నిర్మించిన ఫోర్‌లేన్ రోడ్డు మధ్యలో ఏర్పాటు చేసిన డివైడర్లలో ఎర్ర మట్టికి బదులు మొరం పోసి చేతులు దులుపుకున్నారు. మొరంలో మొక్కలు ఎలా పెరుగుతాయో అధికారులు ఆలోచించాలి. డివైడర్ల మధ్యలో మొరం తీసేసి ఎర్ర మట్టి పోయించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

– కొనుకటి హరీశ్, నీలోజిపల్లి

రాతి కట్టడాలు నిర్మించాలి



కొదురుపాక గ్రామం నుంచి నీలోజిపల్లి వరకు నిర్మించిన ఫోర్‌లేర్ రోడ్డులో ఇరువైపులా మొరం పోశారు. కొన్ని ప్రాంతాల్లో మొరంతో రోడ్డు బాగా ఎత్తయ్యింది. వర్షాకాలంలో కురిసే వర్షాలకు రోడ్డు పక్కన పోసిన మొరం మొత్తం కొట్టుకుపోయి కయ్యలు పడే ప్రమాదముంది. ఇక్కడ రాతి కట్టడాలు నిర్మించాలి.

– సారంపల్లి, రాజు, కొదురుపాక

ఎర్ర మట్టి పోయిస్తాం



ఫోర్‌లేన్ రోడ్డులో డివైడర్ల మధ్యలో మొరం పోసిన విషయం మా దృష్టికి వచ్చింది. మొరం పోయడం ఆపాం. త్వరలో మొరం తీయించి ఎర్ర మట్టి పోసేందుకు చర్యలు తీసుకుంటాం. రోడ్డు ఎత్తయిన ప్రాంతంలో రాతి కట్టడం నిర్మించే పనుల కోసం ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరయ్యాక పనులు ప్రారంభిస్తాం.

– జె.సతీశ్, ఆర్‌అండ్‌బీ ఏఈ, బోయినపల్లి



కేంద్రం నిండా ధాన్యం..

బోయినపల్లి: బోయినపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతులు తెచ్చిన ధాన్యం కుప్పలుతెప్పలుగా పేరుకుపోయి ఉంది. కేంద్రంలో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డీసీఎమ్మెస్ ఆధ్వర్యంలో ఇక్కడ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశారు. వారం రోజులుగా వరి కోసిన రైతులు పెద్ద మొత్తంలో ధాన్యం తెచ్చి మార్కెట్ యార్డులో పోస్తున్నారు. వర్ష సూచన ఉండడంతో రాత్రి కవర్లు కప్పి తిరిగి ఉదయం కవర్లు తీసి ధాన్యం ఆరబెడుతున్నారు. కొందరు రైతులు ట్రాక్టర్‌తో ధాన్యం నేర్పుతున్నారు. త్వరగా ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.

చలివేంద్రం ప్రారంభం



నర్సింగపూర్‌లో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ లావణ్య

చందుర్తి: నర్సింగపూర్ బస్టాండ్ ప్రాంతంలో ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు బైరగోని సత్తవ్వ, సాయాబుల జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని చందుర్తి ఎంపీపీ బైరగోని లావణ్య శుక్రవారం ప్రారంభించారు. జిల్లా గౌడ సంఘం అధికార ప్రతినిధి రమేశ్‌గౌడ్, సెస్ గ్రామ అధికార ప్రతినిధి సంపునూరి దశరథం, వార్డు మాజీ సభ్యులు ముత్యాల నరేశ్, గుర్రం దేవయ్య, కొత్త ఎల్లారెడ్డి, లక్ష్మీనర్సయ్య, పేరుక రాజయ్య, ఎర్రం శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు పరిశీలన

చందుర్తి(వేములవాడ): చందుర్తి మండల కేంద్రంలోని ఆరోవార్డులో ఎంపీ నిధులతో నిర్మించిన సీసీ రోడ్డు పనులను కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ శుక్రవారం పరిశీలించారు. చందుర్తిలో సైడ్ డ్రెయినేజీ, సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.36లక్షలు ఎంపీ నిధులతో పనులు కొనసాగుతున్నాయి. ఈయన వెంట బీజేపీ జిల్లా అధ్యక్షులు ప్రతాప రామకృష్ణ, వేములవాడ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి చెన్నమనేని వికాస్‌రావు, జిల్లా ఉపాధ్యక్షుడు సిరికొండ శ్రీనివాస్ ఉన్నారు.

గల్ఫ్ కార్మికుడిని ఆదుకోవాలి

ముస్తాబాద్: ముస్తాబాద్‌కు చెందిన గల్ఫ్ కార్మికుడు మహమ్మద్ నజీర్ దుబాయిలో అనారోగ్యంతో బాధపడుతూ స్వగ్రామానికి వచ్చి ఆత్మహత్యకు పాల్పడ్డారని గల్ఫ్ జేఏసీ నాయకుడు తోట ధర్మేందర్ అన్నారు. ఆయనను బతికించుకునేందుకు రూ.5లక్షలు ఖర్చు చేశారన్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిన మాజీ సర్పంచులు

ఎల్లారెడ్డిపేట: మండలానికి చెందిన ఇద్దరు మాజీ సర్పంచులు శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. మున్నూరు శ్వేత కాపు సంఘం అధ్యక్షుడు మేగి దేవయ్యతోపాటు దుమాల మాజీ సర్పంచ్ కదిరి వెంకట శ్రీనివాస్‌గౌడ్, రాగట్లపల్లి మాజీ సర్పంచ్ దాసరి మహేందర్‌తోపాటు మరో 100 మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. మండల కేంద్రంలోని పార్టీ ఆఫీస్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి పార్టీ కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ పదేళ్లపాటు బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎన్నో అక్రమాలకు పాల్పడిందన్నారు. తన ఫోన్ కూడా ట్యాపింగ్ చేశారని, ఈమేరకు హైదరాబాద్లో కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పదేళ్లుగా నష్టపోయిన రైతులకు రూపాయి కూడా పరిహారం ఇవ్వని బీఆర్‌ఎస్ నాయకులు పొలంబాట పట్టడం విడ్డూరంగా ఉందన్నారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, జిల్లా కార్యదర్శి లింగంగౌడ్, వంగ గిరిధర్‌రెడ్డి, చెన్నిబాబు, గంట బుచ్చగౌడ్, అనవేని రవి, సుధాకర్‌గౌడ్, మర్రి శ్రీనివాస్‌రెడ్డి, కొత్తపల్లి దేవయ్య, మల్లేశం పాల్గొన్నారు.



పార్టీ కండువా కప్పుతున్న కేకే మహేందర్‌రెడ్డి

కాంగ్రెస్‌లో చేరికలు

వీర్నపల్లి: ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి ఉమ్మడి మండలాల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు జజ్జర నాగరాజుతోపాటు వార్డు సభ్యులు, కుర్మ సంఘం నాయకులు, సివిల్ కాంట్రాక్టర్ ఉత్తం అంజయ్య శుక్రవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో కేకే మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కేకే మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు. వీర్నపల్లి మండల అధ్యక్షుడు భూత శ్రీనివాస్, మండల యూత్ అధ్యక్షుడు బొంగు తిరుపతి, నాయకులు గుగులోత్ లచ్చిరాం, రాజశేఖర్, మల్లయ్య, కాంతయ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ చైర్మన్‌కు అభినందనల వెల్లువ

గంభీరావుపేట(సిరిసిల్ల): రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అజ్మతుల్లా హుస్సేనీని గంభీరావుపేటలోని ఆయన స్వగృహంలో సెస్ చైర్మన్ చిక్కాల రామారావు శుక్రవారం కలిశారు. పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి గంభీరావుపేటకు వచ్చిన సందర్భంగా మర్యాదపూర్వకంగా కలిశారు. బీఆర్‌ఎస్ నాయకులు వెంకటస్వామిగౌడ్, రాజారాం, కమలాకర్‌రెడ్డి, సుభాష్ ఉన్నారు.

ఎల్లారెడ్డిపేట: వక్ఫ్ బోర్డు చైర్మన్ అజ్మతుల్లా హుస్సేనీని పలువురు మండల నాయకులు కలిశారు. గంభీరావుపేటలోని తన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందించారు. మండలంలోని రాచర్లబొప్పాపూర్ గ్రామ జామె మసీద్ కమిటీ అధ్యక్షుడు ఇర్ఫాన్ హుస్సేన్, ఉపాధ్యక్షులు ఖాలిద్, అశ్వక్, సల్మాన్, మహమ్మద్ ఇంత్యాజ్, అస్లాంభాయ్ పాల్గొన్నారు.

రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అజ్మతుల్లా హుస్సేనీని రేవంత్‌రెడ్డి టీమ్ జిల్లా అధ్యక్షుడు గూడ విజయ్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాతూరి భూపాల్‌రెడ్డి, బండారి బాల్‌రెడ్డి, రేవంత్‌రెడ్డి టీమ్ సభ్యులు కిరణ్, శ్రావణ్ మర్యాదపూర్వకంగా కలిశారు.

కోనరావుపేట: తెలంగాణ రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అజ్మతుల్లాను మండల నాయకులు శుక్రవారం కలిశారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు షేక్ ఫిరోజ్‌పాషా ఆధ్వర్యంలో కోఆప్షన్ సభ్యుడు అబ్దుల్ రషీద్, జిల్లా ప్రధాన కార్యదర్శి మహ్మద్ రియాజ్ తదితరులు ఆయనను ఘనంగా సన్మానించారు. ముస్లింల సమస్యలను పరిష్కరించాలని కోరారు.



అజ్మతుల్లా హుస్సేనీకి పుష్పగుచ్ఛం ఇస్తున్న సెస్ చైర్మన్ రామారావు

ఎండ నుంచి రక్షణేది..

వీర్నపల్లి(సిరిసిల్ల): వీర్నపల్లి మండలం కేంద్రంతోపాటు మండలంలోని అన్ని గ్రామాల్లో రోజుకు 2వేల మందికి పైగా కూలీలు ఉపాధిహామీ పని చేస్తున్నారు. ఈసారి ఉపాధిహామీలో అవకతవకలను అరికట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంది. పనులకు వచ్చిన వారి వివరాల నమోదుకు ప్రత్యేక యాప్ నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం(ఎన్ఎంఎంఎస్) వచ్చింది. ఈ యాప్ పనులు ప్రారంభానికి ముందు వచ్చిన వారి ఫొటోను పని ప్రదేశంలోనే ఫోన్‌లో తీసి ఉదయం 11 గంటల్లోపు అప్‌లోడ్ చేయాలి. ఈ విధానంతో కూలీలకు ఇబ్బంది కలుగుతోంది. నెట్వర్క్ సరిగా రాకపోతే గంటల తరబడి ఎండలోనే నిల్చొనే పరిస్థితి ఉందని కూలీలు వాపోతున్నారు. పని చేసే ప్రదేశంలో కూలీలకు ఎలాంటి సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వెంట తెచ్చుకున్న రుమాలు నెత్తికి చుట్టుకొని సేదతీరుతున్నారు. గతంలో పని ప్రదేశంలో నీడ వసతి కల్పించేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. నీటి, నీడ సౌకర్యంతోపాటు ప్రాథమిక చికిత్సకు సంబంధించిన మందులు అందుబాటులో ఉంచాలని కోరుతున్నారు.



ఎండలోనే ఫొటోలు తీస్తున్న ఉపాధిహామీ సిబ్బంది

ఉపాధి కూలీల ఇంటి బాట..

చందుర్తి: కూలి పనికి తగ్గట్లుగా డబ్బులు చెల్లించడం లేదని ఉపాధిహామీ కూలీలు పనులు చేయకుండా శుక్రవారం ఇంటి దారి పట్టారు. చందుర్తి గ్రామ శివారులోని గుట్టపై కందకాల తవ్వకం పనులను చేపట్టారు. కొలత ప్రకారం పనులు చేసిన తమకు కూలి డబ్బులు రూ.180 వస్తున్నాయని, ప్రభుత్వం కూలి డబ్బులను రూ.300 చెల్లిస్తామని ప్రకటించినా.. పనికి తగ్గట్లుగా వేతనాలు చెల్లించడం లేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూలి డబ్బుల చెల్లింపులో ఫీల్డ్ అసిస్టెంట్ వివక్ష చూపుతున్నారని ఆరోపించారు. కాగా ప్రభుత్వ కొలతల ప్రకారం పనులు చేస్తే డబ్బులు వస్తాయని ఫీల్డ్ అసిస్టెంట్ జోసఫ్ కూలీలకు వివరించినట్లు తెలిపారు. కూలి డబ్బులు తక్కువగా ఇస్తున్నారంటూ కూలీలు మర్రి లక్ష్మణ్, నెరెల్ల నర్సయ్య, పోచెట్టి నర్సయ్య, కట్ట తిరుపతి, మర్రి రాములు, షిర్డి మల్లేశం తదితరులు వాపోయారు.



ఇంటికి వెళ్లిపోతున్న కూలీలు

ఉద్యోగ భద్రత కల్పించాలి



మాట్లాడుతున్న పంపు ఆపరేటర్లు

ముస్తాబాద్: చాలీచాలని వేతనాలతో పని చేస్తున్న గ్రామ పంచాయతీ పంపు ఆపరేటర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, రూ.25వేలకు వేతనాలు పెంచాలని మండల పంచాయతీ పంపు ఆపరేటర్లు కోరారు. మండల కేంద్రంలో సంఘం అధ్యక్షుడు పోషరాములు అధ్యక్షతన పంపు ఆపరేటర్ల సమావేశం జరిగింది. ఎన్నో ఏళ్లుగా పంచాయతీల్లో నీటి సరఫరా కార్మికులుగా పని చేస్తున్న తమను ప్రభుత్వాలు గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం రూ.9వేల జీతానికే సుమారు 16గంటల వరకు పని చేస్తున్నామన్నారు. ఉపాధ్యక్షుడు పిల్లి రాజు, ప్రధాన కార్యదర్శి అబ్బురవేని లక్ష్మణ్, నాయకులు సుధాకర్, దేవయ్య, రవీందర్, రాజు, ఆరీఫ్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు రూ.300 చెల్లించాలి



కూలీలతో సీపీఎం నాయకుడు

బోయినపల్లి: కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో ఆధారంగా ఉపాధిహామీ కూలీలకు రూ.300 కూలి చెల్లించాలని సీపీఎం మండల కన్వీనర్ గురజాల శ్రీధర్ పేర్కొన్నారు. రత్నంపేట గ్రామంలో ఉపాధి హామీ కూలీలతో శుక్రవారం మాట్లాడారు. కూలీలకు సరైన సమయంలో కూలి డబ్బులు వారి బ్యాంకు ఖాతాల్లో జమ కావడం లేదని, దీంతో కూలీలు ఇబ్బంది పడుతున్నారన్నారు. కూలీలు గొండ మురళి, లింగంపల్లి ఎల్లయ్య, రామంచ కనకయ్య, అనిత, ఎల్లవ్వ తదితరులున్నారు.

పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠకు ఆహ్వానం



కేటీఆర్‌కు ఆహ్వాన పత్రిక అందిస్తున్న మండెపల్లి గ్రామస్తులు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండెపల్లి గ్రామంలోని పెద్దమ్మ తల్లి దేవాలయంలో ఈనెల 15న జరిగే విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి రావాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్‌కు గ్రామస్తులు శుక్రవారం ఆహ్వాన పత్రిక అందజేశారు. వారు మాట్లాడుతూ.. 14న విగ్రహాల ఊరేగింపు, 15న ప్రతిష్ఠ, 20న బోనాల సమర్పణ, 21న పెద్దమ్మ–పెద్ది రాజుల కల్యాణం ఉంటుందన్నారు. ముదిరాజ్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

నేడు వేణుగోపాలస్వామి కల్యాణం

బోయినపల్లి: కొదురుపాక ఆర్‌అండ్‌ఆర్ కాలనీలోని వేణుగోపాలస్వామి ఆలయంలో శనివారం రుక్మిణి సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి వారి తిరుకల్యాణం జరుగుతుందని ఆలయ అర్చకుడు మర్రిపల్లి వేణుగోపాలచార్యులు శుక్రవారం తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ



ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందిస్తున్న ఏఎన్ఎం సుజాత

వీర్నపల్లి: మండల కేంద్రంలో ఉపాధిహామీ పనులు జరుగుతున్న ప్రదేశంలో ఏఎన్ఎం సుజాత శుక్రవారం కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. వేసవి కాలంలో వడదెబ్బ, అస్వస్థతకు గురి కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఫీల్డ్ అసిస్టెంట్ రాజు తదితరులు పాల్గొన్నారు.

చిత్ర కథ



నిరుపయోగంగా నీటి తొట్టి

కోనరావుపేట: పశువుల దాహార్తి తీర్చడానికి ఏర్పాటు చేసిన నీటి తొట్టీలు నిరుపయోగంగా మారుతున్నాయి. దీంతో జీవాలు తాగునీటికి అల్లాడుతున్నాయి. కనగర్తి గ్రామ శివారులో ఏర్పాటు చేసిన నీటి తొట్టి నిరుపయోగంగా మారింది. కొన్ని నెలలుగా నీళ్లు పట్టకపోవడంతో పశువులు దాహార్తితో ఇబ్బంది పడుతున్నాయి. పాలకులు స్పందించి పశువుల తొట్టిని వినియోగంలోకి తేవాలని రైతులు కోరుతున్నారు.